


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**ఎందరో అమెరికన్స్** హిందూ భావజాలం వైపు మొగ్గుతున్నారు. మాంసాహారాన్ని వదలి శాఖాహారులవుతున్నారు. ఒకప్పుడు ఎవరికి వారే యమునా తీరంలో వున్న వాళ్ళు ఇప్పుడు తల్లిదండ్రుల్ని పట్టించుకుంటున్నారు. ఆహార వ్యవహారాల్లో కూడా భారతీయుల్ని అనుసరిస్తున్నారు. "ఓ క్షణం ఆగాడు పుండరీకాక్షుడు. అచ్యుత్, వాసు, వింటున్నారు.

"అలాగే హిందువులు మహమ్మదీయులుగా మారుతున్నారు. మరికొందరు క్రైస్తవులుగా మారుతున్నారు. ఎవరు ఏ మతం పుచ్చుకున్నా వచ్చే ఇబ్బంది ఏదీలేదు. కానీ ప్రాబ్లం వచ్చేది ఆ తరవాత తరం వాళ్ళకి. నేను ఇప్పటికిప్పుడు ముస్లింగా మారతాను. నా ప్రాబ్లం. ఇప్పటివరకూ హిందువుగా వున్నా గనక, ఇప్పటివరకూ నేను పూజించిన దేవతల్ని తిట్టను. నేను అనుసరించిన సంస్కృతిని విమర్శించాను. కానీ, నా సంతానం? అఫ్‌కోర్స్ మళ్ళీ పిల్లలకి జన్మనిస్తే వాళ్ళు పుట్టుకతో ముస్లింలు అవుతారు. నాకుండే సమ్యమనం వారికి హిందువుల మీద ఉంటుందా? చచ్చినా ఉండదు. అప్పుడొస్తాయి అర్థంలేని మత ద్వేషాలు. అంతేకాదు, మతం మార్చుకున్న హిందువుల్ని ముస్లింలు నిజంగా వాళ్ళతోసమానంగా చూస్తారా? తమతో మనసా వాచా కలుపుకుంటారా? No. ప్రతి మతంలోనూ ఎన్నో ఎన్నో

తెగలున్నాయి. భేదాలున్నాయి. సైద్ధాంతిక విభేదాలున్నాయి. ఇవతలివైపు నించి చూసేవారికి అటువైపు వున్న యీ విపరీతాలు కంటికి కనిపించవు. అందులోకి వెళ్ళాక అర్ధమైనా చేసేది ఏముంటుందీ? జీవితం అనేది అతి చిన్నది. అశాశ్వతమైనది. బ్రతికి వున్నన్నాళ్ళూ హాయిగా బతకాలి. చుట్టూ వారిని బ్రతికించాలి. కులం ఏదయితేనేం, మతం ఏదయితేనేం, మనిషి మనిషిగా ఉండటం ముఖ్యం. అప్పుడే అందరికీ మనఃశ్శాంతి లభిస్తుంది" అన్నారు పుండరీకాక్షుడు. ఇటువంటి చర్చలు ఆ ఇంట్లో కొత్త కాదు. జరుగుతూ ఉండేవే.

"కానీ నాన్నా! మనిషి మతం మార్చుకోవచ్చు. తన ఇష్టంవచ్చిన దైవాన్ని కొలుచుకోవచ్చు. 'మానవతని' దానవత్వంగా మార్చుకోకూడదుగా! మనిషిని దైవం వైపు మళ్ళించి దైవత్వం వైపు నడింపించాల్సిన మానవత్వం – దానవత్వం వైపుకి మనసుని మళ్ళించి రాక్షసుడిగా మారిస్తే?

ఎన్ని రకాలైన ఆయుధాల్ని మనిషి సమకూర్చుకున్నాడూ? 'స్వయం రక్షణ  కోసం అంటాడు. ఎప్పటికప్పుడు 'రక్షణ' యొక్క పరిధి పెరుగుతూనే ఉంటుందిగా!" అన్నాడు వాసుదేవ్.

"ఎలా సార్" చనువుగా అడిగాడు అచ్యుత్.

"మొదలు స్వయం రక్షణ. అంటే నా రక్షణ  కోసం అన్నమాట. ఆ తరవాత మన రక్షణ. అంటే కుటుంబ రక్షణ కోసం, ఆ తరవాత గ్రామ, రాష్ట్ర, దేశ రక్షణల కోసం. 'నా' – నించి 'మన' దగ్గరికి వచ్చేసరికే రక్షణ పెద్ద భారమౌతుంది. ప్రతివాడూ తన రక్షణ కోసం కత్తుల్ని బరిశల్నీ పిస్తోళ్ళనీ AK47లనీ సమకూర్చుకుంటే? సంఘ వ్యవస్థ పరిస్థితి ఏమిటీ? ఎవడు ఎవడ్ని ఎప్పుడు కాలుస్తాడో, ఎవడు స్వయం రక్షణపేరుతో దాడికి పాల్పడతాడో, ఎవడు చేతిలో ఆయుధం ఉందిగదా అని దోపిడీకి పాల్పడతాడో ఎవరు చెప్పగలరు? ఎంత అస్తవ్యస్త పరిస్థితులు నెలకొంటాయో ఊహించగలమా?" నిర్వేదనతో అన్నాడు వాసుదేవ్.

"ఆయుధం లేనంతకాలం, ఆయుధం సమకూర్చుకోనంతకాలం పగలూ, ప్రతీకారాలూ కూడా ఓ హద్దులోనే ఉంటై. ఆయుధం కానీ నాయకత్వ పవర్ గానీ అందుబాటులో వుంటే, మ్రోగేవి మృత్యుఘంటికలే! అప్పుడు మాట్లాడేది మనుషులు మనసులు కాదు – అహంకారాలూ అధికారాలూ ఆయుధాలు" నిర్వికారంగా అన్నారు పుండరీకాక్షయ్య.

"ఒరే వాసూ, మా అమ్మమ్మ చెప్పేది నిస్పృహతోటీ, నిరాశతోటీ, ఆవేదనతోటీ, ఆవేశం తోటీ ఏ పని చేసినా వృధా అని. ఇప్పుడు నీకు కావాల్సింది లోక రీతి కాదు. దుండగుల్ని పట్టి బంధించడం. అది మరచి..." మాటని మధ్యలో త్రుంచేసి సన్నగా నవ్వింది సౌభాగ్యలక్ష్మి.

"నిజం అమ్మా నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళూ నిజం. దేశం ఎటు వెళ్ళాలో చూసుకోవాల్సింది ప్రభుత్వం. నా పని నా కర్తవ్యాన్ని నూటికి నూరుపాళ్ళూ సిన్సియర్‌గా నిర్వర్తించడం" కృతజ్ఞతగా తల్లిని చూసి అన్నాడు వాసుదేవ్.

"నిజం సౌభాగ్యం.. నువ్వన్నదే రైటు. ఏది సరైన పనో నాకూ చాలాసార్లు చెప్పి దారి చూపేదానివీ" లేచి అన్నారు పుండరీకాక్షుడు.

"అందుకే వాసుని పెళ్ళిచేసుకోమనేది! వెనకనించి ఎవరో ఒకరు సతాయిస్తేగానీ పనులు జరగవు" నవ్వి అన్నది సౌభాగ్య లక్ష్మి

"వినాశనానికి రెండు పద్ధతులు. చెరువులో గులకరాయిపడి వృత్తాలు వృత్తాలుగా నీళ్ళు చెరువు మధ్యనించి అంచులకు పయినించినట్టు, ఓ కేంద్రం నించి ఓ దుశ్చర్య మొదలై ప్రపంచాన్ని ఆక్రమించడం. ఒకటి, రెండో ప్రపంచ యుద్ధాలు మొదలైంది యీ పద్ధతిలోనే. అంతెందుకూ, మహాభారతం మొదలైందీ ఇలాగే" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"రెండోదీ?" అడిగాడు శృంగి.

"చెరువు చుట్టూ గట్టుమీద కూర్చున్న కుప్పలన్నీ ఒకేసారి చెరువులోకి దూకి మధ్యకి రావడం" నవ్వారు యజ్ఞప్ప.

"బాగుంది. అంటే చుట్టూ అంటుకున్న మంటలు అన్నిటినీ ఆహుతి చేస్తూ కేంద్ర బిందువుకి చేరుకోవడం" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"ఇప్పుడు మనం మాట్లాడుతున్నది దేనిగురించీ?" లోపలికి వస్తూ అన్నారు డా.టివిఎస్ శాస్త్రిగారు.

"ప్రత్యేకంగా అంటూ ఏదీలేదు డాక్టరుగారు. వినాశనం గురించి చెబుతూ ఒకటి బైటీనించి లోపలికి అయితే, రెండోది లోపలినించి బయటికి అంటున్నారు పెద్దలు" అన్నాడూ శృంగి.

"జబ్బులూ అంతేలెండి. లోపల్నించి బయటపడేవీ – బయటనించి లోపలికి దూసుకెళ్ళేవీ. చూస్తే యీ లోకంలో జరుగుతున్నది 'బయట – లోపల' కథే!" నవ్వారు డాక్టర్.

"హ...హ..హ... అన్నిటిదారీ ఒకటేనన్నమాట. శ్వాసలాగా లోపలికి వచ్చి జీవింపచెయ్యటం. నిశ్వాసలా బయటికిపోయి అంతమొందించడం" అన్నారు యజ్ఞప్ప.

"ఏవండోయ్ ఇరవైనాలుగ్గంటలూ జీవితాన్ని గురించి మాట్లాడవచ్చుగానీ, వినాశనాలూ, చావులూ గురించి కాదు" అంటూ అందరికీ టీ గ్లాసులు అందిస్తూ అన్నది శ్రీమతి టివిఎస్ శాస్త్రిగారు.

"అదీ నిజమే.. అయ్యా, వీరంతా కొండపైకి వెళ్ళారు. కొండల రాయుని దర్శనానికి. కిందకి వచ్చాక బహుశా ఎవరిదరిన వాళ్ళు తమ తమ గూళ్ళకి పయనిస్తారనుకుంటాను" అన్నారు శాస్త్రిగారు.

"అవును. సామాన్లుకూడా సిద్ధం చేసుకునే వెళ్ళారు. అందరి సంగతీ సరే.. నా ఆలోచన మాత్రం రాబీ వెబ్‌స్టర్ మీదే వుంది చాలా విచిత్రమైన జీవితం అతనిది. అమెరికానించి ఇండియా వచ్చాడు. రావడం రావడమే మద్రాసులో విలియమ్స్ అనే ఆత్మ చేతిలోకి వెళ్ళిపోయాడు. మద్రాస్ టు తిరుపతి టాక్సీలో కూడా ఏళుమలై రూపంలోకి దూరిన విలియమ్స్ తోనే ప్రయాణించాడు. గోవిందరాజస్వామి ఆలయంలో అడుగుపెడుతూనే గత జన్మలు గుర్తుకొచ్చి 'తండ్రీ' అని తెలుగులో అరిచి, దుకాణాలు గత జన్మలో ఎలా వుండేవో చెప్పే ప్రయత్నం చేశాడు. ఆ తరువాత రోజుల తరబడి నిద్రావస్తలాంటి స్థితి. మధ్య మధ్యలో మహాభారతపు ఆయుధాల గురించిన కలవరింతలు.. అసలు సిసలు ముఖ్యమైన ప్రశ్న ఏమంటే, రాబీ మళ్ళీ తన దేశానికి వెళ్తాడా? విలియమ్స్ వెళ్ళనిస్తాడా?" అందరి వంకా చూస్తూ తన సందేహాన్ని బయటపెట్టాడు శ్రీనివాస్" అవును.. అదో పెద్ద ప్రశ్న ఇంగ్లీషులో అన్నది శరద్వతి.

"ఆ విషయం ఆలోచించాల్సిందే" అన్నారు యజ్ఞప్ప.

"ఆలోచించవలసిన విషయమైనా, అది మన చేతుల్లో లేదుగా! నిర్ణయం ఇప్పటికే అత్యంత అసహనాన్ని కూడగట్టుకున్న, చాలా ఇరిటేషన్ని మూటగట్టుకున్న రాబీదో, ఆ రాబీకి దిశానిర్దేశాన్ని ఆత్మ రూపంలో చేస్తున్న విలియమ్స్ దో అవుతుంది. మన చేతుల్లో మాత్రం ఉందని నేను అనుకోవడంలేదు" మెల్లగా టీ తాగుతూ అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు. ఆయన టీ తాగరు. అయినా టీ కప్పు తీసుకుని మరీ తాగుతున్నారు.

"ఆ మాట నిజమే. రాబీ ఏం చేస్తాడో రాబీ కాదు, నిర్ణయించేది విలియమ్స్" అన్నాడు శ్రీనివాస్.

హిట్సన్, రాజోవ్‌స్కీ, అతీం, డాంటే, వంటి అన్యమతస్తులు డిక్లరేషన్ ఇచ్చి కొండల రాయుడ్ని చూసి పరవశించపోతే, గోర్కీ, శమంతో, దద్లానీ, నరోత్తములు వేంకటేశ్వరుని వైభవం చూసి మైమరచిపోయారు. రాబీ మౌనంగా వేంకటేశ్వరుడ్ని తేరిపార జూస్తున్నాడు... చేతుల్ని ముకుళించి.

ప్రసాదాల రుచికి అమెరికన్స్, ఉత్తర భారతదేశం వారూ ఆహ్లాదానందాలతో మేను మరచి పోతే, గోర్కీ ఆ ప్రసాదాల విశిష్టతని వారికి వివరించాడు. పాపనాశనం జలధారల్లో సాంతం తడిసి, ఉత్సాహంతో కేకలు పెడుతూ అందరూ ఆనందించారు.

"ఈ బట్టల్ని ఇలాగేవంటి మీదే ఆరిపోనీ" అన్నాడు స్టిట్యూట్.

యా.. నెవర్ నెవర్ థాట్ ఆఫ్ విజిటింగ్ యువర్ ఇండియన్ టెంపులు.. గ్రేటెస్ట్ డే ఆఫ్ మై లైఫ్" అన్నాడు డాంబే.

"గుడి లోపల పరిమళ భరితం.. గుడిబైటికి వచ్చాక ప్రసాదాల సువాసన. అబ్బ.. ఎంత అద్భుతంగా వుందో యీ దర్శనం" కళ్ళు మూసి తెరుస్తూ అన్నాడు రాజోవ్స్కీ.

"దేముడున్నాడా లేడా అనేది ప్రక్కన పెడితే, ఇక్కడికి వచ్చి దర్శనం చెయ్యడం మాత్రం అపురూపం.. అద్భుతం.. అపూర్వం. ఎందుకంటే, యీ కొండగాలి చల్లదనం మహా వృక్షాల నీడల చల్లదనం. వికసించే పువ్వుల పరిమళం.. గోవిందా గోవిందా అంటూ దేవుడ్ని మనసారా స్మరించే యీ భక్తసందోహం, అంతా ఓ చిత్రమైన, పవిత్రమైన లోకంలోకి అడుగు పెట్టినట్టు ఉంది. మనసులో ఏ దిగులూ లేదు" అన్నాడు దద్లానీ.

"అవును.. మనసులో ఏ దిగులూ లేదు. ఏ అభద్రతా లేదు. స్వామి అభయ హస్తం చూశాక" అన్నాడు శమంతో.

"అవును.. దైవం అంటే ఓ నమ్మకం. దైవం అంటే మానవతకి అతీతమైన ఓ శక్తి. దైవం అంటే ధైర్యం. అందుకే మనుషులు దైవాలకి ఆలయాలు నిర్మించేది. మనకి అంటే మానవుడికి అతీతమైన దైవశక్తి మనని రక్షిస్తుందనే నమ్మకం మీదే, భక్తి, భయాల వల్లనే కోట్లాది అరాచకాలు జరగకుండా మనసుల్లోనే అణిగిపోతున్నాయి. దేముడున్నాడు, దుష్టుల్ని శిక్షిస్తాడు, శిష్టుల్ని రక్షిస్తాడు అనే నమ్మకమే మనిషికి లేకపోతే, లోకంలో అన్యాయాలకి లెక్క అనేది వుంటుందా? జనాల్లో ప్రశాంతత, భయమూ అనేదే ముఖ్యమైనవి. శాంతి కోరుకునేవాడు అశాంతిని సృష్టించాడు. భయం. అదేది లేకపోతే మనసు అనే రాజ్యాన్ని ఏలేది అహంకారమూ అంధకారమే" అన్నాడు మొహమ్మద్ అతీం.

"అవును అతీం భాయ్. ఏమతమైనా, ఏదైవమైనా శ్రద్ధాభక్తులు ఉంటే, మనుషులు సత్ప్రవర్తనతో ఉంటారు. లేకపోతే అసాంఘిక శక్తులై సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తారు" అన్నాడు నరోత్తమ్.

రాబీ అన్నీ వింటూ కూర్చున్నాడేగానీ, ఒక్కమాట మాట్లాడలేదు. చూపులు ఎక్కడో వున్నాయి.

దర్శనానంతం బయటికొచ్చిన భక్తులు గుంపుగా కూర్చున్న యీ విదేశీ స్వదేశీ సముహాన్నీ వింతగా చూస్తున్నారు.

వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. భక్తుల మొహాల్లో వేంకట రమణుడిని దర్శించిన ఆనందోత్సాహాలు చక్కగా ప్రతిఫలిస్తున్నాయి.

గాలి మెలమెల్లగా అలలు అలలుగా శరీరాల్ని స్పృశిస్తోంది.

"I want one more" లడ్డూని చూపిస్తూ అడిగాడు స్టిట్సన్.

"What is it called?" అడిగాడు రాజోవ్స్కీ తనూ చెయ్యి జాస్తూ.

గోర్కీ ఇద్దరికీ చెరో లడ్డూ ఇచ్చి, "దీని లడ్డూ అంటారు. ఇది ఈ కలియుగదైవానికి అతి ఇష్టమైన నైవేద్యం" అని వివరించాడు.

"ఓహ్.. నైస్ టు హియర్ దట్" లడ్డూ కొరికి అన్నాడు స్టిట్సన్. దూరం నించి ఓ నామాల వ్యక్తి తమవైపు రావడం చూశాడు గోర్కీ."

మిగతా వారంతా ఆశ్చర్యంగా గోర్కీవంకా, ఆయన వంకా చూస్తున్నారు.

"ఏదో ఆలోచనలో ఉన్నట్టున్నారు అందరూ!" చిన్నగా నవ్వి అన్నాడాయన.

"అలాంటిదే స్వామీ. ప్రకృతి గురించీ ప్రకృతి వైపరీత్యాలు గురించీ" చిన్నగా అన్నాడు గోర్కీ. సూటిగా గోర్కీ కళ్ళల్లోకి చూశాడతను. ఆయనకి మహా ఉంటే ఓ యాభై యేళ్ళు ఉంటై. నుదుటి మీద నామాలు.. వంటి మీద నామాలూ వైష్ణవుడని చెప్పకనే చెబుతున్నాయి.

అన్నటికన్నా అతని ముఖంలో ఓ ప్రకాశం ఉంది.

"ప్రకృతి చాలా శాంతిమయి. ఆ ప్రకృతిని మానవుడు ధ్వంసం చేస్తే పుట్టేవి వైపరీత్యాలు. బాబూ, వైపరీత్యాల్ని ఆపాలంటే, మనుషుల్లో మార్పురావాలి. అదిరాదు. ఎందుకంటే అవసరానికంటే మించి ప్రకృతిని వాడుకుంటున్నాడు మనిషి. అందుకు శిక్ష పడకతప్పదు. అయినా, మీరేమి ఆలోచిస్తున్నారు?" చెబుతూనే దారి మళ్ళించాడు ఆయన.

"ఈ మధ్య జరుగుతున్న సంఘటనలనన్నీ నెమరువేసుకుంటున్నా ఏదైనా పరిష్కారం ఉంటుందా అని స్వామి దర్శనానికి వచ్చింది" నిట్టూర్చి అన్నాడు గోర్కీ.

"మీరన్నది నిజమే. మనిషి చేసిన దుష్కర్మలని సరిదిద్దాలంటే భగవంతుడికి మాత్రమే సాధ్యమౌతుంది. బాబూ...ప్రార్థన చాలా గొప్పది. అది అన్ని అశాంతులనీ శాంతపరుస్తుంది. 'యదాయదా హ ధర్మస్య శ్లోకం' వినే వుంటారుగా. అధర్మమనే చీకటి ఆవరించినప్పుడు వెలుగు అనే దైవత్వం మానవుడి రూపుదాల్చి భూమికొస్తూంది. ప్రార్థించండి" అన్నాడాయన.

"మీరన్నది నిజమే కావచ్చు. కానీ తెలియనిది ఎలా ప్రార్థించాలనేది. 'సమస్తలోకాస్సుఖినోభవంతు' అంటాం. కేవలం అలా ఉచ్చరించడం వలన సమస్త లోకాలు ఉద్ధరింపబడతాయా? అయ్యా మీరెవరో నాకు తెలీదు. మిమ్మల్ని చూడగానే నమస్కరించాలనిపించింది. మా బాధ ఏమిటో మీతో చెప్పాలనిపించింది" ఓ క్షణం ఆగాడు గోర్కీ.

సంభాషణ తెలుగులో జరుగుతోంది గనక మిగతా వారందరు అయోమయంగా వింటున్నారు.

"నా పేరు పరవస్తు విశ్వంభరాచార్యులు. నేను సాత్తాద వైష్ణవుడ్ని. మీ అందరినీ చూడగానే ఎందుకో ఇక్కడికి రావాలనిపించింది. నేను జ్యోతిషాన్ని, ముఖలక్షణాలు చదవగలను. ముఖలక్షణాలను బట్టి జ్యోతిష్యం కూడా చెప్పగలను. బాబూ, మీ అందరిలోనూ అతడు, చాలా చిత్తావస్థకి గురి అవుతాడు. అంతేకాదు అతనిలో ద్వైదీభావం ఉంది. చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎందుకంటే, అతను అతను కాడు.. అతనిలా కనిపిస్తున్న మరొకడు. మీరు అడగవచ్చు. నేను ఏమి ఆశించి మీతో ఇలా మాట్లాడుతున్నానని నేను ఏమీ ఆశించడంలేదు. చెప్పాలని మనసులో గాఢమైన ఆలోచన కలిగినప్పుడు.. అది చెప్పి తీరాలని మా గురువాజ్ఞ. ఇక ప్రకృతీ, వైపరీత్యాలా, చెరువులో వుండే నీటిని తాగవచ్చు, తోడి పారబొయ్యా వచ్చు. కుండలో నింపుకుని ఇంటికీ తీసికెళ్ళ వచ్చు, పశువుల్నీ చెరువులో కడగొచ్చు. కురుస్తుందో లేదో ఒకవేళ కురిస్తే ఎక్కడ కురవాలో, ఎంత కురవాలో దానికే తెలుసు. మన పని వర్షం కోసం ఎదురు చూడటమేకాదు, పొలాన్ని దున్నించి సిద్ధంగా పెట్టుకున్నప్పుడే ఆ వర్ష ఫలితాన్ని సంపూర్ణంగా అందుకోవచ్చు. సెలవామరి."

అందర్నీ ఆశీర్వదిస్తున్నట్లుగా చేయిని ఊపి చరచరా ముందు కెళ్ళిపోయాడాయన.

ఆయన చూపించింది, అయోమయంగా చూస్తున్న రాబీ వెబ్‌స్టర్‌ని.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments